క్లుప్తంగా

కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వారధి ట్రస్ట్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: ఇందిరా నగర్‌కాలనీలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం కళ్లజోళ్ల పంపిణీ నిర్వహించారు. వారధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు వితరణతో రూ.30 వేల విలువైన కళ్లజోళ్లను నేత్ర రోగులకు అందించారు. కార్యక్రమంలో సామాజికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్, వలవల మేరీ సుశీలా, మద్దిపాటి శ్రీను, గుర్రం వీర బాబు, పెదవేగి రాంబాబు, బసవరాజు వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

జంగారెడ్డిగూడెం: 1/19 సర్క్యులర్ అమలు చేయాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి డీవీఎస్ఎన్‌టీ రాజు మాట్లాడుతూ జోనల్ కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ములగలంపల్లిలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన టెంట్లు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదానికి సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద వెంకన్నస్వామి పేరుతో హోమ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అయితే హోమం నిర్వహిస్తున్న సమయంలో అందులో వేసిన కొబ్బరి కాయ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో భక్తులు పరుగులు పెట్టారు. ఒక టెంట్‌తో పాటు కొన్ని కుర్చీలు దగ్ధమైనట్లు తెలిపారు. అయితే ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కంటి వైద్య శిబిరం నిర్వహణ



ఉచిత కంటి వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ప్రజా సంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం సోమవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కే మాబు సుభాని అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వంగ గోపి, ఎ.ప్రభాకర్ రావు, పిల్లి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

టి.నరసాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు జనవరి రెండో వారం నుంచి డబ్బులు జమ కాలేదన్నారు.

పరిమిత పంటతో రైతులకు మేలు



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఈడీ విశ్వశ్రీ

కొయ్యలగూడెం: పరిమిత పంటతోనే వర్జీనియా పొగాకు రైతులకు లబ్ధి చేకూర్చగలమని వర్జీనియా పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ పేర్కొన్నారు. సోమవారం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ప్రారంభించిన కొనుగోళ్లను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. రైతులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సాగుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసని అయితే బోర్డు ఇచ్చిన పరిమితుల మేరకు సాగు చేయాలనేది తమ అభిమతమన్నారు. వర్జీనియా పొగాకు వేలం నిర్వహణాధికారిణి గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ఆమె ప్రారంభించారు. కాకర్ల నంది, తోటకూర శ్రీనివాస్, సర్పంచ్ తోటకూర పద్మావతి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, అడప సత్తిబాబు, గెడ సత్తిబాబు పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'

- మంగళ, బుధవారాల్లో నామమాత్రంగా నిర్వహణ
- అధికారుల గైర్హాజరు.. పట్టించుకోని ఉన్నతాధికారులు
- నిరాశలో రైతులు.. నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



ఏఓ ఒక్కరే పాల్గొన్న పొలం పిలుస్తోంది కార్యక్రమం (ఫైల్)

బుట్టాయగూడెం: వ్యవసాయ రైతులకు సాగుపై అవగాహన కల్పించి సస్యరక్షణలో వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే ఈ కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులతో పాటు పలు అనుబంధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని రైతుల వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. అయితే క్షేత్ర స్థాయిలో ఇందుకు విరుద్ధంగా జరుగుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు మినహా మిగిలిన అనుబంధశాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎక్కడా కనిపించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో 7 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాలు చొప్పున వారానికి 4 గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాలి. అయితే ఇందుకు భిన్నంగా కార్యక్రమం నిర్వహించడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సభల్లో కనిపించని అధికారులు

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు తప్ప అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సెరీకల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, మార్కెటింగ్ అధికారులు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వనరుల శాఖ, విద్యుత్ శాఖ, జలవనరుల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలి. వారితో పాటుగా రైతుమిత్ర సంఘాలు భూసార పరీక్షల సిబ్బంది హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు రైతులకు అందించాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీ, సబ్సిడీలను వివరించి రైతులను చైతన్య పరచాలి. అయితే నియోజకవర్గంలో నిర్వహించే మీటింగ్‌ల్లో అనుబంధ శాఖల అధికారులు గైర్హాజరవుతున్నట్లు కనిపిస్తుంది. వ్యవసాయశాఖ అధికారులు మాత్రమే తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముందస్తు సమాచారం లేక సభలు డీలా

ఏ రోజు ఏ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారనే ముందస్తు సమాచారం లేకపోవడం వలన రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. అలాగే అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లోకి వెళ్లి కొంతమంది రైతులను తీసుకొచ్చి కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన భ్రమగానే మారుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

> **అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలి**
>
> 
>
> పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సిందే. కార్యక్రమాల వివరాలను సమాచారం అందిస్తున్నాం. రైతులు పొలాల్లో బిజీగా ఉండడం వలన ఉన్న వారితోనే కార్యక్రమం చేస్తున్నాం. ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నాలుగు సభలు నిర్వహించేలా కృషి చేస్తున్నాం.
>
> –డి.ముత్యాలరావు, ఏవో, బుట్టాయగూడెం మండలం

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అందుగుల రాములు కుటుంబానికి ఆ పార్టీ నేతలు సోమవారం నిత్యావసర సరుకులను అందజేశారు. ముందుగా రాములు కుటుంబ సభ్యులను స్థానిక ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారియ్య, ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం, తదితరులు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రూ.1,000 నగదు, 50 కేజీల బియ్యం, 15 కేజీల వంట నూనె, 50 కేజీల ఉల్లిపాయలను రాములు కుమారుడు గాంధీకి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పున్నపు కృష్ణ, రాచగర్ల రామకృష్ణ, చవల నారయ్య, నరహరిశెట్టి అప్పారావు, కస్సె గంగరాజు, అందుగుల రాజేష్, పొంగులేటి సంతోష్, గంజి నాగార్జున, రెడ్డి చిన్ని, బోడ అశోక్, కేశవ, నితిన్, సుబ్బు, దంసెల్లి రమేష్, ఈల్ అఖిల్, కట్టూరి మంగరాజు, గొల్లపలి సుబ్బారావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: నివాసిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో నివాసిత ప్రజలు ఆందోళన చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నాపురం పంచాయతీలోని మహదేవపురం ఆర్ఎస్ నెంబర్ 45–6లో రెండు సంవత్సరాల నుంచి ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నామని కానీ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. గత ఎన్నికల సమయంలో విద్యుత్తు ఏర్పాటుకు తాగునీటి సదుపాయాలకు హామీ ఇచ్చారని పాలనలోకి వచ్చి 9 నెలలు పూర్తయిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జొన్నకూడి వెంకటేశ్వరరావు, రంగనాథం, మహమ్మద్ సలీమా, మడకం రామన్న, కామన సత్యనారాయణ,, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల నిరసన ప్రదర్శన



జంగారెడ్డిగూడెం పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

జంగారెడ్డిగూడెం: అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీప్తి హత్యకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో కారం రమ్య ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక జేపీ సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్, గంగానమ్మ గుడిసెంటర్, బోసుబొమ్మ సెంటర్ మీదుగా ప్రదర్శన నిర్వహించి, మానహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు రక్షణ కల్పించాలని కోరారు. బన్నీ అనే వ్యక్తి టాన్స్‌జెండర్ దీపును దారుణంగా హత్య చేశారని, అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.దుర్గ, అనిత, వైష్ణవి, మీనాక్షి, షేక్ సోని, విజయ, లక్ష్మి, సత్య, అవంతిక, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్న సైన్స్ అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన కంప్యూటర్ సైన్స్ విభాగంలో డిజిటల్ లాజిక్ సిస్టమ్ స్కిల్స్‌పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో నిర్వహించే కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి యువత డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు పరుగులు తీస్తున్నారని, విద్యార్థులు ఇలాంటి వర్క్ షాప్‌లు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జె.రాజా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం తప్పనిసరి అని, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే నూతన టెక్నాలజీ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, జి.వెంకటలాల్, అధ్యాపకేతర సిబ్బంది కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులను సర్వే చేయాలి



సర్వే డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ అన్సార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చింతలపూడి: నగర పంచాయతీలో ఉన్న చెరువులను సర్వే చేసి చెరువు ముందు, వెనుక ఉన్న ఆక్రమణలను తొలగించాలని సీపీఐ చింతలపూడి పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఏలూరు ప్రజా పరిష్కార వేదికలో సర్వే డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ అన్సార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చింతలపూడి నగర పంచాయతీలో మొత్తం 21 చెరువులు ఉన్నాయని దీంట్లో ఆర్ఎస్ నంబర్ 798–2లో 2.09 ఎకరాల విస్తీర్ణం, వికోయ కుంట సర్వే నంబర్ 1513, విస్తీర్ణం 9 ఎకరాల 58 సెంట్లు, మాదిగకుంట సర్వే నంబర్ 1120–2 నాచుకుంట ఇవి పూర్తిగా కనుమరుగయ్యి పలు పేర్లతో అడంగల్‌లో నమోదై ఉన్నాయని తెలిపారు. చింతలపూడి పెద్ద చెరువు, బోయగూడెం చెరువు, వేగి లింగేశ్వర స్వామి చెరువు, మొహిద్దీన్ కుంట చెరువుల ముందు భాగం, వెనుక భాగం ఆక్రమించి బిల్డింగులు కట్టారు. ఇంకా భవనాలు నిర్మిస్తూనే ఉన్నారు. మిగిలిన చెరువులు ఆక్రమించబడి సాగు భూములుగా మారుతున్నాయని వీటిని సర్వే చేయాలని ఆక్రమణలు తొలగించాలని ఈ నెల 18వ తేదీన సీపీఐ పట్టణ కమిటీ చింతలపూడి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. సర్వేర్ల కొరత ఉందని కమిషనర్ చెప్పినట్లు తెలిపారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న చెరువులను సర్వే చేయాలని చెరువుల ఆక్రమణలు తొలగించాలని చింతలపూడి నగర పంచాయతీకి సర్వేయర్‌ను కేటాయించాలని కోరినట్లు సీపీఐ సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన ఏఐకేఎంఎస్ నాయకులు

బుట్టాయగూడెం: గిరిజనులు 18 సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు మార్చేస్తున్నారని ఆరోపిస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం వాడపల్లి, వెలుతురువారిగూడెం గ్రామాల్లో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములు 1/70 పరిధిలోని వస్తున్నాయని 1997లో పోరాటం చేశామని చెప్పారు. ఆ సమయంలో ఆ భూములకు సంబంధించి 2007లో గిరిజనులకు అప్పటి తహసీల్దార్ డి–నమూనా పట్టాలతో పాటు పాస్ పుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం 2018లో ఒకసారి, 2024లో మరోసారి మళ్లీ ఈ ఏడాది భూములకు సంబంధించి అడంగల్‌లో రికార్డుల నుంచి తొలగించారని చెప్పారు. దీనిని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. దీనికి సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, తగరం బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యలగూడెం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం బయ్యనగూడెం పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ రెండు వారాలు మించి కఫంతో కూడిన దగ్గు, ఆకలి మందగించడం, రోజూ సాయంత్రం జ్వరం, అకస్మాత్తుగా బరువు తగ్గటం వంటివి టీబీ వ్యాధి లక్షణాలని, అటువంటి వారు తక్షణమే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. టీబీ వ్యాధిని అశ్రద్ధ చేస్తే ఊపిరితిత్తులు పాడైపోయి, మరణానికి దారితీస్తుందని తెలిపారు. టీబీ వ్యాధికి ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, శైలజ, సూపర్‌వైజర్ చాన్‌బాషా, మరియమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: విద్యుత్ మరమ్మతులు, ట్రీ కటింగ్ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వవిద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జంగారెడ్డిగూడెం ఈఈ పీఆర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున టి.నరసాపురం టౌన్, కేఆర్‌గూడెం, టీడీపేట ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు. అలాగే వ్యవసాయ విద్యుత్ వేళల్లో కూడా మార్పులు ఉంటాయని తెలిపారు.

సారా నిందితుల అరెస్టు



కుక్కునూరు: బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు



కొయ్యలగూడెం: పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

కొయ్యలగూడెం: సారా క్రయవిక్రయాలకు సంబంధించి కొందరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం, ఎస్సై వి.చంద్రశేఖర్‌లు సోమవారం తెలిపారు. సరిపల్లి గ్రామానికి చెందిన మన్యం వెంకటరావు, పెలిమిల్లి సురేష్ సుమారు 50 లీటర్ల నాటు సారా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అదే విధంగా డిప్పకాయలపాడు గ్రామానికి చెందిన చదలవాడ సురేష్ 10 లీటర్ల నాటు సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరితో పాటుగా నాటు సారా క్రయవిక్రయాలకు సంబంధించి అంకాలగూడెం గ్రామానికి చెందిన తోట సురేష్, రామానుజపురం గ్రామానికి చెందిన యార్లగడ్డ సత్యనారాయణలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

కుక్కునూరు: మండలంలోని వేలేరు గ్రామ శివారులో సారా బట్టీలపై సోమవారం కుక్కునూరు పోలీసులు దాడులు చేశారు. కుక్కునూరు సీఐ ఎం.రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 250 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారు చేసే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ భవనం నిర్మించాలి

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని కుంకాల ఆనకట్ట ఎత్తు పెంచి రైతులకు సాగునీరందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి అన్నారు. సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర రెండో రోజు పోలవరం మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొడియం నాగమణి మాట్లాడుతూ మండలంలోని కుంకాల సమీపంలో నిర్మించిన ఆనకట్ట పూడిక తీయాలని ఎత్తు పెంచి రైతులకు సాగునీరందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఎన్‌డీ పేట వరకు ఉన్న రోడ్డు మార్గంలో కొండవాగుల్లో కల్వర్టులు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొండవాగుల్లో కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. వింజరం గ్రామంలో జీసీసీ డిపో భవనం శిథిలమైందని కొత్త భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, బొరగం సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో పంట రుణాలు

టి.నరసాపురం: సహకార సంఘ రైతులకు పంట రుణాలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘ చైర్‌పర్సన్ వై.ఏసుకుమార్ తెలిపారు. స్థానిక సంఘ ఆవరణలో సోమవారం ఏసుకుమార్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో పంట రుణాలు ఆలస్యమవుతున్నాయని రైతులు కోరడంతో స్పందించిన చైర్‌పర్సన్ మాట్లాడుతూ పంట రుణాలు విషయం ఉన్నతాధికారులతో చర్చించి సకాలంలో అందేలా చూస్తామని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి సొసైటీ ద్వారా సంఘ సభ్యులకు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘ సీఈవో జి.భుజంగరావు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 13 అర్జీలు

జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎంవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యకు ఎండార్స్‌మెంట్ ఇచ్చి, నిర్దేశించిన గడువులోగా పునరావృతం కాని విధంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కాగా సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలు సమస్యలపై 13 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు నాలుగు మోటార్ సైకిళ్లు, రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సోమవారం రాత్రి కొయ్యలగూడెంలోని ఓ టీడీపీ నేత నివాసంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేయగా, నిందితులు నగదుతో సహా పట్టుబడినట్లు తెలిసింది. అయితే దీనిపై పోలీసులతో కూటమి నేతలు సంప్రదింపులు చేస్తున్నారన్న సమాచారం ఉంది.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఒక వ్యక్తిని లారీ ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కామవరపుకోట మండలం ఆడమిల్లికి చెందిన రాజులపాటి శివ మణికంఠ ఆదివారం భద్రాచలం వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, తాడువాయి వద్ద లారీ ఢీకొంది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌జబీర్ తెలిపారు.

మహిళకు ఆస్తి అప్పగింత

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో మహిళ గంటా రమాదేవికి చెందిన స్థిరాస్తిని ఆమెకు అప్పగించాలని కొవ్వూరు కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సోమవారం కోర్టు సిబ్బంది, పోలీసుల రక్షణతో రమాదేవికి అప్పగించారు. రెండు వేల గజాల స్థలం, అందులో ఉన్న భవనం స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించారు. కొన్నేళ్ల క్రితం పట్టణానికి చెందిన ఒక వ్యక్తి కళాశాల నిర్వహణకు స్థలం, అందులోని భవనంతో పాటు రమాదేవి లీజుకు ఇచ్చారు. అయితే లీజు గడువు ముగిసిన తరువాత ఖాళీ చేయమని కళాశాల యజమానిని అడగ్గా కళాశాల నడుస్తుండగా, ఖాళీ చేయడం కుదరదని ఆయన కోర్టుకు వెళ్లారు. 14 ఏళ్ల పాటు కోర్టులో నడిచిన కేసు రమాదేవికి అనుకూలంగా తీర్పు రావడంతో ఆమె ఆస్తిని ఆమెకు అప్పగించారు.

ఐదుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆటో స్టాండ్ వద్ద ఏర్పడిన ఘర్షణ నేపథ్యంలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక ఉప్పలమెట్టకు చెందిన షేక్ ఆరీఫ్ ఆటో నడుపుకుని జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బస్టాండ్ వద్ద గల ఆటో స్టాండ్‌లో కొత్తూరు శ్రీను మరో నలుగురు షేక్ ఆరీఫ్‌ను దాడి చేసి కొట్టారు. దీంతో ఆరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.